




కోలాట ప్రదర్శన

నేడు మహాశివరాత్రి



గజ వాహనంపై ఆది దేవుడి వైభవం

- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- అద్భుత ఘట్టం పాగాలంకరణ, కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి



శ్రీశైలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇల కైలాసమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన గజవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు, హారతులు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం నుంచి వెలుపలకి తీసుకొచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలను నిర్వహించి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. గ్రామోత్సవం ఎదుట కోలాటం, చెక్కభజన, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, శంఖునాదాలు మార్మోగాయి. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు ఉత్సవం కొనసాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. కాగా ఉత్సవ ఏర్పాట్లను డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ విష్ణుచరణ్, ఈఓ, శ్రీనివాసరావు, డీఎస్పీ రామాంజినాయక్ పరిశీలించారు.

ప్రధాన ఘట్టం పాగాలంకరణ

బుధవారం లింగోద్భవకాల మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం అర్ధరాత్రి వేళ పాగాలంకరణ నిర్వహిస్తారు. అనంతరం స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శ్రీశైలంలో పాగాలంకరణకు ప్రత్యేక విశిష్టత ఉంది. శైవ క్షేత్రాల్లో మరెక్కడా జరగని విధంగా శ్రీశైల జ్యోతిర్లింగమూర్తికి మూడు తరాలుగా ఈ అద్భుత వేడుక జరుగుతోంది. శ్రీశైలంలో లింగోద్భవకాలాన జరిగే పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం మూడు తరాలుగా శ్రీశైల మల్లన్నకు పాగాను అలంకరిస్తోంది. కల్యాణోత్సవానికి ముందు వరుడు మల్లన్నకు తలపాగా చుట్టే ఈ ఆచార శైలి అద్భుతంగా ఉంటుంది. ఏడాది పాటు దీక్షలో ఉండి రోజుకు ఒక మూర చొప్పున 365 రోజులు పాగా వస్త్రాన్ని పృథ్వీ కుటుంబం నేస్తుంది. మహాశివరాత్రి రోజున చిమ్మ చీకట్లో దిగంబరులుగా మారి స్వామివారి గర్భాలయ విమాన కలశాలు, నవనందులను కలుపుతూ పాగాను అలంకరిస్తారు. ఈ సమయంలో ప్రధాన ఆలయంపైన విద్యుత్ వెలుగులు పడకుండా అలాగే సెల్‌ఫోన్లతో ఫొటోలు తీయనివ్వకుండా దేవస్థాన సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించి ప్రధాన ఆలయం ద్వారాలు మూసివేస్తారు. ఈ సమయంలో ప్రధాన ఆలయం పరిసరాలు, వెలుపల భక్తుల శివనామస్మరణ చేస్తూ గడుపుతారు.



గజవాహన సేవలో భక్తుల నృత్యాలు, కోలాహలం



పాతాలగంగలో భక్తుల పుణ్యస్నానాలు



పాదయాత్రగా శ్రీశైలానికి చేరుకుంటున్న భక్తులు

జగన్ భవిష్యత్తులో ఎమ్మెల్యే కూడా కాలేడు

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహమ్మద్



మౌలానా షేక్ ముస్తాక్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న మత పెద్దలు

నంద్యాల రూరల్ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి భవిష్యత్తులో ముఖ్యమంత్రి కాదు కదా ఎమ్మెల్యే కూడా కాలేడని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహమ్మద్ జోస్యం చెప్పారు. మంగళవారం పట్టణ శివారుల్లో ఉన్న హారుణ్ ఫంక్షన్ హాల్‌లో మౌలానా షేక్ ముస్తాక్ అహమ్మద్‌ను మౌజాంలు, ఇమాంలు, మత పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలందరు టీడీపీకి అండగా ఉంటారన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేయటం హర్షణీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క మసీదుకు, ఇమాంలు, మౌజాంలకు ఒక్క పైసా ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటం నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లకే సాధ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో మత పెద్దలు, రాష్ట్ర మైనారిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఆర్ఎంబీని కర్నూలులో ఏర్పాటు చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి డిమాండ్
- పట్టణంలో ర్యాలీ
- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను కర్నూలులోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి డిమాండ్ చేసింది. మంగళవారం సమితి సభ్యులు నంద్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ కృష్ణానది బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని జనవరి 6, 2021, జూలై 6,2022న జరిగిన అఖిలపక్ష సమావేశంలో చేసిన ఏకగ్రీవ తీర్మానాలకు టీడీపీ మద్దతు ఇచ్చిందన్న విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే కేఆర్ఎంబీని విజయవాడలో ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 80 టీఎంసీల నీరందిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా డెల్టాకు నీరవ్వాల్సిన అవసరం లేదన్నారు. రాయలసీమ సమాజం ఆకాంక్షలకు విరుద్ధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు ప్రియదర్శినికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు రాజశేఖర్, రంగనాయుడు, వైసీపీ నాయకులు సోమశేఖర్ రెడ్డి, ఐఎంఎల్ నాయకులు సలాం, జాగో ముస్లిం వేదిక జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా, క్రిస్టియన్ జేఏసీ నాయకులు జాన్, రైతు నాయకులు ఉప్పలపాటి బాలీశ్వర రెడ్డి, బొక్కెం రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సాగునీటి సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

సూర్యప్రభ వాహనంపై మహానందీశ్వరుడు

- స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం
- మహానందిలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ



మహానందిలో సింహ వాహనంపై గ్రామోత్సవం

మహానంది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. యథావిధిగా ఆలయంలో వేదపండితులు, రుత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలకు ఆలయ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ముందు కర్ణాటక భక్తులు నిర్వహించిన నంది కోల నృత్యాలు పలువురిని ఆకట్టుకన్నాయి. అలాగే రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఉత్సవాల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, ఏఈఓ యర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, దేవికలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బందోబస్తును పరిశీలించిన ఏఎస్పీ: మహానంది శివరాత్రి ఉత్సవాల్లో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసారు. మంగళవారం నంద్యాల ఏఎస్పీ జావళి ఆలయ పరిసరాల్లో బందోబస్తును పరిశీలించారు. అనంతరం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మహానందిలో జాగరణ..... లింగోద్భవ పూజలు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహానందిలో భక్తులు జాగరణ చేస్తారు. ఆలయంలో లింగోద్భవ పుణ్యకాల పూజలు నిర్వహిస్తారు. అనంతరం కల్యాణం నిర్వహిస్తారు.

నల్లమల ఘాట్‌రోడ్డులో ఆంక్షలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి తరలివెళ్లే గూడ్స్‌వాహనాలపై పోలీసు, రవాణా శాఖలు పలు ఆంక్షలు విధించాయి. గతంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాల్లో నల్లమల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి మీదుగా గూడ్స్ వాహనాలపై నిబంధనలు అమలు చేశారు. ఆత్మకూరు మీదుగా దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాలు, భారీ వాహనాలను దారిమళ్లించి నంద్యాల టర్నింగ్, వెలుగోడు మీదుగా నంద్యాల, గిద్దలూరుల నుంచి దారిమళ్లించేలా చర్యలు తీసుకుంటున్నారు.

తుంగా తీరంలో రామలింగేశ్వరుడు


నందవరం మండలం గురుజాల రామలింగేశ్వర ఆలయం

కర్నూలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీ జలాలు పరివాహకాన్ని సారవంతం చేస్తున్నాయి. పల్లె ప్రజల దాహం తీరుస్తున్నాయి. దీనితోపాటు తుంగా తీరం పొడవునా ఆధ్యాత్మిక పరిమళాలు వీస్తుంటాయి. ఎన్నో పుణ్యక్షేత్రాలు భక్తుల నీరాజనాలు అందుకుంటున్నాయి. మేళిగనూరు, కందకూరు, రాంపురం, గురుజాల గ్రామాల్లో శ్రీరాముడు శివలింగాలు ప్రతిష్ఠించి పూజలు చేశాడు.

- శ్రీరాముడు శివలింగాలు ప్రతిష్ఠించిన ఆలయాలు
- తుంగభద్ర ఒడ్డున ఆధ్యాత్మిక కెరటాలు
- శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

అందుకే రామలింగేశ్వర క్షేత్రాలుగా అవి విశిష్టతను సంతరించుకున్నాయి. బుధవారం శివరాత్రి ఉత్సవాలకు తుంగభద్ర తీరంలోని రామలింగేశ్వర ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

గురుజాల ఇసుక శివలింగం

తుంగభద్ర నదితీరంలో నందవరం మండలం గురుజాల గ్రామం చెంత రాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగానికి రామేశ్వరం అంతటి ప్రాధాన్యత ఉంది. రావణ సంహారం తర్వాత శ్రీరాముడు గురుజాలలో ఇసుక లింగాన్ని ప్రతిష్ఠించాడని అంటారు. పాండవులు ఈ క్షేత్రాన్ని సందర్శించినప్పుడు పార్థ (అర్జున) లింగం, భీమ లింగం, ధర్మలింగం ప్రతిష్ఠించారని అంటారు. శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఈ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.


రాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగం

రాంపురంలో రామలింగేశ్వరుడు

మంత్రాలయం మండలం తుంగభద్ర తీరంలో రాంపురం గ్రామంలో ఉన్న రామలింగేశ్వర క్షేత్రానికి శివరాత్రి రోజు భక్తులు పెద్ద ఎత్తున వచ్చి పూజలు చేస్తారు. ఈ శివలింగాన్ని కూడా రాముడు స్వయంగా ప్రతిష్ఠించాడని నమ్మకం. ఆలయ ధర్మకర్త వై. సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


రాముడు ప్రతిష్ఠించిన శివ లింగానికి ప్రత్యేక పూజలు



తుంగా జల అభిషిక్తుడు

కోసిగి మండలం కందుకూరు సమీపంలో తుంగభద్ర నది తీరంలో రామలింగేశ్వర క్షేత్రం ఉంది. శ్రీరాముడు తుంగభద్ర నదీజలాలతో ఇక్కడ అభిషేకం చేశాడని అంటారు. శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.


కోసిగి మండలం కందుకూరులోని రామలింగేశ్వర ఆలయం

ఓ వైపుకు చూస్తున్నట్లుండే మేళిగనూరు శివలింగం

కౌతాళం మండలం మేళిగనూరు దగ్గర నదీ తీరంలో రామలింగేశ్వర క్షేత్రం ఉంది. ఇక్కడ శివలింగం ఒక వైపుకు చూస్తున్నట్లుగా ఉండటం ప్రత్యేకం. ఆలయ పూజారి మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో బుధవారం జరిగే శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు.


కౌతాళం మండలం మేళిగనూరు చెంత శ్రీరాముడు ప్రతిష్ఠించిన ఇసుక లింగం

శివపూజకు వేళాయె...

- నేడు మహా శివరాత్రి
- ముస్తాబైన శివాలయాలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆదిదేవుడైన మహాశివుడికి ఇష్టమైన 'మహా శివరాత్రి' సందర్భంగా బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని శ్రీశైలం, మహానంది, యాగంటి, బ్రహ్మగుండం, దుర్గాభోగేశ్వరం, సంగమేశ్వరం, రామునితీర్థం, రుద్ర కోటేశ్వరం, కాల్వబుగ్గ తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటుగా, ఆయా పట్టణ, గ్రామ ప్రాంతాల్లోని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, లింగోద్భవ కాల వేడుకలు, శివపార్వతుల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. భక్తకోటి శివరాత్రి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపావాస దీక్షలు పాటిస్తారు. ఓంకార రూపుడైన శివ పంచాక్షరి మంత్ర పఠనం చేస్తూ, రాత్రివేళ జాగరణలు చేస్తూ దేవదేవుని అనుగ్రహానికి పాత్రులయ్యేందుకు సిద్ధమయ్యారు. మహాశివరాత్రి వేడుకలు సందడి ఉమ్మడి జిల్లాలో వారం రోజులు ముందుగానే ప్రారంభమైంది. శ్రీశైలంతోపాటు, మహానంది క్షేత్రాల్లో ఆరంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలను చూసి తరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలివస్తున్నారు.



జగమంతా శివమయం...

మహాశివుడు ఈ విశాల జగతినంతా వ్యాపించి ఉన్నాడని శివపురాణం చెబుతోంది. పరమ శివుని ఆకృతిలో ఒక్కో అర్థం ఉంది. శివుడు ధరించే త్రిశూలం సత్వ రజో, తమో గుణాలకు ప్రతిరూపాలు. ఢమరుకం శబ్ద బ్రహ్మ స్వరూపం. శివయ్య తన శిరస్సున ధరించిన నెలవంక మనోనిగ్రహానికి, గంగాదేవి శాశ్వతత్వానికి ప్రతీకలుగా నిలుస్తారు. ఆయన ధరించిన ఏనుగు చర్మం అహంకారాన్ని త్యజించమని చెబుతుంది. ఆశీనంపై ఉన్న పులిచర్మం కోరికలకు దూరంగా ఉండమని చెబుతుంది. నుదుట ధరించే భస్మం పరిశుద్ధతనూ, నందీశ్వరుడు సత్సంగానికి, మూడవ నేత్రం జ్ఞానానికి సూచికలుగా నిలుస్తాయి. శివుడంటే మానవులకు సర్వ శుభాలను కలిగించే దైవమని మహాభారతంలో శ్రీకృష్ణుని వచనం. అగస్త్య మహర్షి శివుడిని 'అచింత్యరూపం అవ్యక్తం అనంతం అమృతం శివమ్' అని వర్ణించాడు. అంటే చింతించుటకు వీలుకానివాడు, అవ్యక్త స్వరూపుడు, అనంతుడు, అమృత స్వరూపమైన పరబ్రహ్మయే శివుడని అర్థం. జ్ఞానరహిత భక్తి కూడా కొన్ని రోజులే ఉంటుంది. జ్ఞానము లేని భక్తి, గాలివీస్తే ఎగిరిపోయే దూదిపింజలాంటిది. జ్ఞానముతో కూడిన భక్తి, హోరుగాలి వీచినా చలించని మేరు పర్వతంలా ఉంటుందని అగస్త్య మహర్షి శివుని గురించి ప్రబోధించారు.

ఒకే చిత్రంలో శివయ్య లీలలు


ఒకే చిత్రంలో శివయ్య లీలలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 8ఇంటూ8 పొడవు వెడల్పు గల డ్రాయింగ్ షీట్‌పై వాటర్‌కలర్స్ తో ఒకే చిత్రంలో పరమ శివుని గురించి కొన్ని ప్రధాన ఘట్టాలు సూక్ష్మచిత్రాల ద్వారా చిత్రీకరించారు. శివయ్య భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్నట్లు చిత్రించారు. ఈ చిత్రంలో భక్తకన్నప్ప, మార్కండేయులు, శివాజీ మహరాజ్, హనుమంతుని రామకార్యం, శ్రీకాళహస్తీశ్వర మహత్యం, రావణాసురుడు తపస్సు చేస్తున్నట్లు చిత్రం, క్షీరసాగరమదనం నుంచి వచ్చిన విషాన్ని శివుడు సేవిస్తున్నట్లుగా, అర్జునుడు పాశుపతాస్త్రం పొందినట్లు, భగీరధుని భక్తి, కుమారస్వామి, గణపతిస్వాములు ఆదిదంపతులను పూజిస్తున్నట్లు, అక్కమహాదేవి, ఆదిశంకరాచార్యులను సేవిస్తున్నట్లు, హనుమంతుడు శివున్ని ఆరాధిస్తున్నట్లు, ఇలా చిత్రకారుడు చిత్రాలు చిత్రీకరించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు.


కోటేష్ చిత్రంలో చిత్రీకరిస్తున్న దృశ్యం

అఖిల భారత ఛాంపియన్ షిప్ పోటీల్లో పీడీ బాషా

సంజామల, ఫిబ్రవరి 25: అఖిల భారత సివిల్ సర్వీసు అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకుడు బాషా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారత ప్రభుత్వం నుంచి ప్రశంస పొందారు. ఈ నెల 19 నుండి 21 వరకు పంజాబ్ రాష్ట్రంలోని ఛండీగఢ్‌లో జరిగిన అఖిల భారత ఉద్యోగులకు భారత ప్రభుత్వం నిర్వహించి ఆలిండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల జిల్లా సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పి.డి పోటీలో పాల్గొన్నారు. షార్ట్‌పుట్ త్రో 42 - 50 పురుషుల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశ వ్యాప్తంగా 8వ స్థానం దక్కించుకున్నారు. భారత ప్రభుత్వం నుంచి ప్రశంస పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో హెచ్.ఎం శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయనను ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

1న నారా లోకేశ్ రాక



మంత్రాలయం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలకు వచ్చేనెల 1 న రాష్ట్ర ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్ మంత్రాలయానికి రానున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గురువైభవోత్సవాల ప్రారంభ వేడుకల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారన్నారు. లోకేశ్‌కు గురువైభవోత్సవం-2025 అవార్డును పీఠాధిపతి అందజేస్తారన్నారు. మంత్రి పర్యటన ఖరారు కావడంతో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు నిర్వహించాలి

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి
- కాపీయింగ్, మాల్ ప్రాక్టీసు జరగకూడదు : కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు, మార్చి 17 నుంచి 28 వరకు జరిగే పదో తరగతి ఓపెన్ పరీక్షలకు, మార్చి 3 నుంచి మార్చి 15వ వరకు జరిగే ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జిల్లాలో 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 40,776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

శ్రీగిరి.. భక్తసిరి

- మల్లన్న కల్యాణానికి తరలివస్తున్న లక్షలాది భక్తులు
- నల్లమలలో మారుమోగుతున్న శివనామస్మరణ

శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న పాగాలంకరణ, స్వామి అమ్మవార్ల కల్యాణం చూడ్డానికి లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. పాదయాత్రగా వస్తున్న భక్తుల శివనామస్మరణతో నల్లమల మారుమోగుతోంది. బ్రహ్మోత్సవాలలో ప్రధానంగా పాగాలంకరణ, లింగోద్భవం, కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం కనులారా వీక్షించి భక్తులు తరిస్తారు. వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. భక్తులతో శ్రీగిరి నిండిపోయింది.





ఆయనే సాక్ష్యం

శ్రీగిరి క్షేత్ర దర్శనానికి ముందు భక్తులు సాక్షిగణపతిని దర్శించుకుంటారు. శ్రీశైలానికి మూడు కి.మీ దూరంలో ఉన్న సాక్షిగణపతి ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీ. తనను దర్శించుకున్న ప్రతి భక్తుడి పేరును మల్లన్నకు గణనాథుడు తెలియజేశారని భక్తుల నమ్మకం. అందుకే ఇక్కడ వెలసిన గణనాథుడిని సాక్షి గణపతి అంటారు.

ఖాళీ ప్రదేశాలే..

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు, పాదయాత్రికులు మల్లన్న దర్శించుకుంటున్నారు. అనంతరం రోజువారీ ఉత్సవాలను వీక్షించి ఆరుబైటే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు చాలక ఖాళీ ప్రదేశం, వసతి సముదాయాల ముందు ప్రాంగణాలు, ఫుట్‌పాత్‌లను పానుపుగా చేసుకుంటున్నారు.

ఇంతింతై వటుడింతై..

శివదీక్ష సర్వపాపహరణం



శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 25 ఆంధ్రజ్యోతి: నియమనిష్ఠలతో కూడిన శివదీక్ష సర్వపాపహరణం. శివదీక్ష చేపట్టేవారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ శివదీక్ష సరిగ్గా 31 ఏళ్ల క్రితం పరిమిత సంఖ్యలో ప్రారంభమైంది. అందుకు ఆద్యుడు అప్పటి దేవస్థాన ఈవో వంగాల శంకరరెడ్డి. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ. 1994 సంవత్సరంలో ఈవోగా బాధ్యతలు చేపట్టడానికి రాగా అదేసమయంలో అయ్యప్పదీక్ష మాలధారులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని వస్తూ తారసపడ్డారు. దీంతో శివదీక్ష ఆలోచన వచ్చింది. ఈ విషయంపై పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆగమశాస్త్ర పండితులతో సమావేశం నిర్వహించి విధివిధానాలు రూపొందించారు. ఆపై ప్రభుత్వ అనుమతి తీసుకున్నాం. అదే ఏడాది శివరాత్రి ముందు ఈవో, దేవస్థాన సిబ్బంది, దుకాణదారులతో 300 మంది శివదీక్ష తీసుకున్నారు. అలా శివదీక్ష తీసుకున్న వారిని టీంలుగా విభజించి వివిధ ప్రాంతాలకు పంపారు. ఆవిధంగా విస్తృత ప్రచారం కల్పించారు. తొలిసారి రెండేళ్ల బాధ్యతలు నిర్వహించిన ఈవో శంకరరెడ్డి తదుపరి కాలంలో మరో రెండుమార్లు ఈవోగా వ్యవహరించారు. ఇప్పుడు ఏటా లక్షల సంఖ్యలో శివదీక్షను చేపట్టి పరమేశ్వరుడి సేవలో తరిస్తున్నారు.

ఏమివ్వాలో శివయ్యకు తెలుసు



చిత్తశుద్ధితో ఆదిదేవుడిని సేవించాలి. ఎవరికి ఏమివ్వాలో శివయ్యకు తెలుసు. శివదీక్ష నాంది దైవసంకల్పం. మల్లన్నస్వామి ఆదేశమే చేయించిదనుకుంటా. నాడు శివదీక్ష ప్రారంభానికి బీజం పడడం పూర్వజన్మ సుకృతం. ఇప్పటికి ఏటా శివదీక్షలో ఉంటాను.

వంగాల శంకరరెడ్డి, విశ్రాంత ఈవో

ఊరికి దూరంగా...

- బొమ్మనపల్లిలో వింత ఆచారం
- సంతానాభివృద్ధి కోసం వనభోజనం
- 200 ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం

మద్దికెర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బొమ్మనపల్లి... మద్దికెర మండలంలోని చిన్న గ్రామం. టెక్నాలజీ దూసుకుపోతున్నా, గ్రామంలో ఎంతో మంది చదువుకున్న వాళ్లు ఉన్నా శతాబ్దాలుగా వస్తున్న ఆచారాన్ని మాత్రం వీడటం లేదు ఆ గ్రామస్థులు క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఓ ఆచాన్ని కొనసాగిస్తున్నారు. చూసేవారికి వింతగా ఉన్నప్పటికీ బొమ్మనపల్లి గ్రామస్థులు మాత్రం చాలా నియమనిష్ఠతో, భక్తిశ్రద్ధలతో ఆచారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో శివరాత్రికి ముందు రోజు అందరూ గ్రామాన్ని వదిలేసి ఊరి బయటకు వెళ్లారు. 200ఏళ్ల కిందట ఓ స్వామీజీ చెప్పిన మాటకు కట్టుబడిన గ్రామస్థులు మంగళవారం ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో ఉదయం 6 గంటలకు గ్రామ శివారుకు వెళ్లిపోయారు. అక్కడే చెట్ల కింద సేద తీరుతూ వనభోజనాన్ని చేసుకుని సాయంత్రం గ్రామానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేసి తమ ఇళ్లకు వేసిన తాళాలు తీసి పూజలు చేసుకున్నారు.

రెండు శతాబ్దాలుగా ఇదే ఆచారం..

ఈ వనభోజనానికి 200 ఏళ్ల నాటి చరిత్ర దాగి ఉంది. బొమ్మనపల్లి గ్రామంలో మొత్తం 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. దాదాపు గ్రామంలో 1300 ఓట్లు ఉన్నాయి. సుమారు 200 ఏళ్ల క్రితమే గ్రామంలో సంతానం కలగడం లేదని, చాలా మంది ఇబ్బందులు పడుతుండేవారు. అయితే అప్పటి గ్రామ పెద్దలు గ్రామంలోని కాశీంతాత స్వామి దగ్గరకు వెళ్లారు. ఆ స్వామి మాఘమాసంలో శివరాత్రికి ముందు రోజు అది కూడా మంగళవారం గ్రామంలో ఒక్కరూ కూడా ఉండకుండా ఉదయం 6 గంటలకే ఇళ్లను శుభ్రం చేసుకోకుండా తాళాలు వేసి గ్రామ శివార్లకు వెళ్లి చెట్ల కింద వనభోజనాలు చేసుకుంటే మీ గ్రామంలో సంతానం అభివృద్ధి జరుగుతుందని తెలపడంతో.. ఆనాటి నుంచి నేటి వరకు ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలోని పిల్లాపాపలు, పెద్దలు అందరూ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. గ్రామ శివారులోని ఎవరికి కావాల్సిన వారు ఒక్కో చెట్టుకింద ఉంటూ వంటా వార్పును చేసుకుని వనభోజనాన్ని నిర్వహించుకున్నారు. కొన్నేళ్ల కిందట ఒక సంవత్సరం ఈ సంప్రదాయాన్ని నిలిపివేయడం వల్ల అశుభం జరగడంతో తిరిగి యథావిధిగా ఈ సంప్రదాయాన్ని కొనసా గిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సాయంత్రం చెట్లకింద ఉన్న వారు అందరూ ఒకేచోటకు చేరుకుని అఖండ దీపం ద్వారా వచ్చి గ్రామంలోని సుంకులమ్మ అమ్మవారికి పూజలు చేసి ఇళ్లకు వెళ్లారు.


పిల్లాపాపలతో శివారులోని చెట్టుకిందకు చేరిన గ్రామస్థులు


సహపంక్తి భోజనం

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో ఆర్‌యూ ఉప కులపతి, రిజిస్ట్రార్లు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పురుషుల పోటీలు ఈ నెల 27 నుంచి మార్చి 3వరకు తమిళనాడులోని సేలంలో పెరియార్ యూనివర్సిటీలో జరుగనున్నాయి. ఈ పోటీల్లో ఆర్‌యూ జట్టు పాల్గొననుంది. వీసీ వి.వెంకట బసవరావు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి పేరు తేవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కేవీ శివకిశోర్, ఆర్‌యూ కోచ్ ప్రభాకర్, దుర్గ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన మంగళవారం కోవెలకుంట్లలో జరిగింది. పట్టణానికి చెందిన హరిణి అనే మహిళ అదే పట్టణానికి చెందిన షాదిక్‌హుసేన్‌ను ప్రేమించి మూడు సంవత్సరాల కిందట వివాహం చేసుకుంది. ఇటీవలనే భర్త సాదిక్‌హుసేన్, అత్త మహబూబ్‌బీ, మామ జాఫర్‌హుసేన్‌లు హరిణిని వేధిస్తున్నారని, అందువల్లే ఆమె సోమవారం రాత్రి ఉరేసుకుందని మృతురాలి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరిణి భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సమీపంలోని పెట్రోలు బంక్ దగ్గర మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని వెంకటరెడ్డికాలనీకి చెందిన గోపాల్(56) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనికి వెళ్లే సమయంలో రోడ్డు దాటుతుండగా ఎక్స్‌కవేటర్ ఢీకొంది. గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని డోన్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూదన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళా కూలి దుర్మరణం

- 10 మందికి గాయాలు

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంంలోని ఊడుమాల్పురం గ్రామ సమీపంలో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందారు. నంద్యాల ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాణ్యం మండలం తొగడ్చేడు తదితర చుట్టు పక్కల గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు ఓ ట్రాక్టర్ ట్రాలీలో నంద్యాల మండలంలోని ఊడుమల్పురం గ్రామంలో పొగాకు కోసేందుకు మంగళవారం వచ్చారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తొగర్చేడు గ్రామస్థురాలు నాగమ్మ (48) అక్కడిక్కడే మృతి చెందగా ట్రాలీలో ప్రయాణిస్తున్న 10 మంది కూలీలు గాయపడ్డారు. ట్రాలీలో పరిమితికి మించి 31 మంది కూలీలను ఎక్కించుకోవడంతో అదుపు తప్పి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నాగమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగమ్మ కుమార్తె అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలులో మరో యువకుడు..

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నగరంలోని కోడుమూరు రహదారిలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలకల్లు గ్రామానికి చెందిన మహేంద్ర (30), భార్య, కూతురుతో కలిసి రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్నాడు. భార్య ఊరుకు వెళ్లడంతో తన మిత్రుడు లింగంతో కలిసి బైక్‌పై బళ్లారి చౌరస్తాకు వచ్చాడు. ఓ హోటల్ టిఫిన్ చేసి తిరిగి వెళ్తుండగా, మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను తెచ్చుకునేందుకు మళ్లీ యూటర్న్ తీసుకుంటుండగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లింగంకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటిస్థల విషయంలో ఓ వ్యక్తిపై దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుత్తిగారి జయరామిరెడ్డి, రామగోపాల్‌రెడ్డి అనే వ్యక్తులు ఇంటి స్థలం విషయంలో నబీరసూల్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెట్నీకోటలో ఫోర్జరీ సంతకాల ఘటనలో కేసు నమోదు..

మండలంలోని పెట్నీకోట గ్రామంలో పెద్దుగాళ్ల సుబ్బమ్మ పేరుమీద ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని ఫోర్జరీ సంతకాలు చేసి, రిజిస్ట్రేషన్ చేశారని, పెద్దుగాళ్ల రామేశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామానికి చెందిన నాగేందర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మరికొందరు కలిసి, సుబ్బమ్మ ప్రమేయం లేకుండా, అదే పేరున్న మరో మహిళతో ఫోర్జరీ సంతకాలు చేయించారన్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ఆలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గత ఏడాది ఏప్రిల్ 4వ తేదిన జరిగిన చోరీ కేసులో అనంతపురం జిల్లాకు చెందిన సరవ భాస్కర్ ఆచారికి ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఆలూరు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపా రు. రైతు భరోసా కేంద్రం తాళం పగులకొట్టి, అక్రమంగా ప్రవేశించి ఎల్‌ఈడీ టీవీ, వాషింగ్ మిషన్, ప్రెజర్ కుక్కర్, కిట్, మాయిశ్చరైజర్ మిషన్, ఎల్‌ఈడీ లైట్స్ చోరీ జరగడంతో అప్పట్లో కేసు నమోదు చేశామని చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన సరవ భాస్కర్ ఆచారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా విచారణ జరిపిన న్యాయమూర్తి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్యూర్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంట్

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ టూ వీలర్ కంపెనీ అయిన ప్యూర్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంటు జారీ చేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్, సభ్యులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో నివాసం ఉంటున్న జి.నిర్మలాదేవి 2022లో ఒక ఎలక్ట్రిక్ టూ వీలర్‌ను రూ.97,800కు కర్నూలులో కొనుగోలు చేశారు. కంపెనీ నిబంధనల మేరకు స్కూటర్ 80 కిలోమీటర్ల వరకు బ్యాటరీ మైలేజీ ఇవ్వాల్సి ఉంది. అయితే.. ఆ స్కూటర్ 5 కిలో మీటర్లకే బ్యాటరీ చార్జింగ్ అయిపోయి ఆగిపోతుండటంతో ఆ మహిళ పలుమార్లు స్థానిక బంగారుపేటలోని డీలర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా స్కూటర్‌లోని లోపాలను కంపెనీ సరి చేయలేకపోయింది. దీంతో విసిగిపోయిన మహిళ జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును పరిశీలించిన జిల్లా వినియోగదారుల కమిషన్ మహిళ కొనుగోలు చేసిన 2 వీలర్‌లో లోపాలు సరిచేయకపోవడం సేవాలోపం అవుతుందని 2023లో నిర్ధారిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఫిర్యాదికి వాహనం ఖరీదు రూ.97,800 లను 9 శాతం వడ్డీతో పాటు కోర్టు ఖర్చులు నష్టపరిహారం కింద అదనంగా మరో రూ.25వేలు చెల్లించాలని గత ఏడాది కంపెనీకి ఆదేశాలు జారీ చేసింది. తీర్పు కాపీ అందిన తర్వాత కూడా కంపెనీ కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయలేదు. దంతో హైదరాబాదులోని ప్యూర్ ఎలక్ట్రిక్ కంపెనీ ఎండీకి అరెస్టు వారెంటు జారీ చేస్తూ కేసును వచ్చే నెల 24వ తేదీకి వాయిదా వేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసరు ఆదేశాలు జారీ చేశారు.

కలాం పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి

- ఆగిపోయిన పనులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తల్లిదండ్రుల విజ్ఞప్తి



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు, ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు సొంతం చేసుకున్న ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2021 నవంబరు 29వ తేదీన 46వ వార్డులో రూ.2కోట్లతో మేయర్ బీవై రామయ్య భవనానికి శంకుస్థాపన చేశారు. దాదాపు నాలుగు సంవత్సరాలు గడచినా భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు.

ఈ పాఠశాలలో 212 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2017 నుంచి 2024 వరకు రాష్ట్రంలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు 2024 వరకు 182 మంది ఎంపికయ్యారు. ప్రతిభ అవార్డులు కూడా అందుకున్నారు. ఆర్‌జీయూకేటీకి 36 మంది సెలెక్ట్ అయ్యారు. 2022, 2023, 2024 రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ అవార్డులను సైతం కైవసం చేసుకున్నారు. ఏపీఆర్‌జేసీ పాలిటెక్నిక్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులు ఎంపిక అవుతున్నారు. అలాంటి పాఠశాలకు శాశ్వత భవనం లేదు.

పేద విద్యార్థులకు న్యాయం చేయాలి



ఈ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డు అందుకుంటున్నారు. భవనాన్ని త్వరగా నిర్మించాలి. ఈ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు అప్పుడే న్యాయం జరుగుతుంది. **- సుధ, విద్యార్థి తల్లి**

అధికారులు పట్టించుకోవడం లేదు



పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ నాలుగు నెలల క్రితం తల్లిదండ్రుల కమిటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ అధికారులు పట్టించుకోలేదు. **- రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్, తల్లిదండ్రుల కమిటీ.**

విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలి



పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి2021 నవంబరు 29న రూ.2 కోట్లతో నగర మేయర్ బీవై రామయ్య శంకుస్థాపన చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి పురోగతి లేదు. భవనం నిర్మిస్తే విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. **- గౌసియా బేగం, అధ్యక్షురాలు, తల్లిదండ్రుల కమిటీ**

పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

పాఠశాలకు కంప్యూటర్లను అందజేయాలని డీఈవో శ్యామూల్ పాల్‌ను అలాగే భవన నిర్మాణాన్ని పూర్తిచేసి, వచ్చే విద్యాసం వత్సరం తరగతులను నిర్వహించేలా చూడాలని మునిస్పల్ కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల ఎంపిక

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పరిధిలోని మండలాలకు అధ్యక్షులుగా పలువురిని నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అధ్యక్షుడు జెంగిటి నరసింహ యాదవ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి నూతన మండలాధ్యక్షులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల వైఫల్యంపై ప్రజల్లో ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే సీజ్ చేయండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- తుంగభద్ర నదిలో ఇసుక పరిశీలన
- నదీ తీర గ్రామాల వీఆర్వోలు, కార్యదర్శులతో సమావేశం



తుంగభద్రను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మంత్రాలయంలోని తుంగభద్ర నది నుంచి శ్మశానం, దర్గా సమీపంలోని ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు, పోలీసు అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై చర్చించారు. మంత్రాలయం, మాధవరం, చెట్నహల్లి తదితర ప్రాంతాల నుంచి ఎమ్మిగనూరు ఇతర గ్రామాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు వీఆర్వోలు, వీఆర్‌ఏలు, గ్రామ కార్యదర్శులు నిఘా ఉంచాలన్నారు.

నదితీర గ్రామాల్లోని ప్రభుత్వ గృహాలకు, సాధారణ గృహాలకు మాత్రమే నది నుంచి ఇసుకను తీసుకెళ్లాలని, పెద్ద పెద్ద భవంతులు, లాడ్జీలు, హోటళ్లు, దుకాణాల నిర్మాణాలు ఎటువంటి పరిస్థితుల్లో తుంగభద్ర నది నుంచి ఇసుక రవాణా చేస్తే అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ రవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, డిప్యూటీ తహసీల్దార్లు టీకే గురురాజరావు, జయరామిరెడ్డి, ఆర్‌ఐ ఆదాం, ఏఎస్‌వో సూర్య ప్రకాష్, వీఆర్వో భీమన్నగౌడు, గ్రామ కార్యదర్శులు నాగరాజు, వేణుగోపాల్, ఇజ్రత్ బాషా, మహేష్, జయలక్ష్మి పాల్గొన్నారు.

చెరుకు పంట దగ్ధం



దగ్ధమైన పంటను చూపుతున్న బాధితుడు

మంత్రాలయం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన మాధవరం గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మాధవరం తుంగభద్ర నది బ్రిడ్జి సమీపంలో కురువ గుడిసె నాగుడు అనే రైతు ఎకరా పొలం కౌలుకు తీసుకొని చెరకు పంట సాగు చేశాడు. అక్కడే రోడ్డుపక్కన చెరుకు మిషన్ ఏర్పాటు చేసుకుని వచ్చి వెళ్తున్న ప్రయాణికులను చెరుకు రసం విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. అయితే మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెరకు దగ్ధం కావడం గమనించి లబోదిబో మంటూ కేకలు వేస్తూ చుట్టుపక్కవారిని పిలిచి నీరు చల్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. అప్పటికే మంటలు వ్యాపించి చెరుకు పంటంతా కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎమ్మిగనూరు అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ వెంకటేష్, సర్దార్ బాషా, ఆంజినేయ రమేష్ వచ్చి ఇతర పంటలకు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. దాదాపు రూ. ఐదు లక్షల నష్టం వాటిల్లిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. చేతికి వచ్చిన పంట అగ్నికి ఆహుతైందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

కొత్తపల్లి వరిగడ్డికి నిప్పు..



దగ్ధమవుతున్న గడ్డివామి

కొత్తపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో మంగళవారం ప్రమాదవశాత్తు ఆరు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పాతకోట వెంకటరమణకు చెందిన మూడు గడ్డివాములు, మల్లయ్యకు చెందిన మూడు గడ్డివాములు మంటలకు కాలిపోయాయి. బాధితులు మాట్లాడుతూ మూగజీవాలకు వరిగడ్డి లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి సుమారు 30 బండ్ల వరిగడ్డిని కొనుగోలు చేసి గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. కొందరు ఆకతాయిలు సిగరెట్, బీడీ తాగి పడేయడం వల్లనే మంట రాజేసుకుని గడ్డివాములు దగ్ధమై ఉంటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలను అదుపులోకి తేవడంతో సమీపంలో ఉన్న గడ్డివాములకు ప్రమాదం తప్పడం వల్ల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

టీవీల దుకాణంలో మంటలు

మంత్రాలయం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర సర్కిల్ సమీపంలో సూగూరు మజీద్‌కు చెందిన టీవీల రిపేరి దుకాణం దగ్ధమైంది. మంగళవారం రాత్రి విద్యుత్ షాట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దుకాణంలో ఉన్న టీవీలు, ఇతర వస్తువులు కాలి బూడిద అయ్యాయి. రూ.3 లక్షలు దాక నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్య శాల ధన్వంతరి హాల్‌లో హెచ్‌వోడీలతో ఐవీఆర్‌ఎస్ ఎన్టీఆర్ వైద్యసేవ ఈ-హాస్పిటల్‌పై సూపరిం టెండెంట్ సమీక్షించారు. ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు చేరువ కావాలని, ప్రభుత్వం ఇటీవల ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్‌లోని ఆరు అంశాలపై కాల్స్, వాట్సాప్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుందని వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వైద్యులు సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని హెచ్‌వోడీలకు సూచించారు. నూతనంగా వచ్చే 250 మంది హౌస్ సర్జన్లకు ఎఫ్‌ఆర్‌ఎస్, డ్రెస్ కోడ్, ఐడీ కార్డులు, అటెండెన్స్‌ను రెగ్యులర్‌గా అమలు చేయాలన్నారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు బయటకు పంపించవద్దని సూచించారు. త్వరలో పలు ఓపీ విభాగాలను తనిఖీ చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీరాములు, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల, డాక్టర్ కిరణ్ కుమార్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ సి.శ్రీనివాసులు, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మందుల కొరత లేదు

ఆసుపత్రిలో మందుల కొరత లేదని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం చాంబర్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులున్నాయని, అత్యవసర మందుల కోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని మందులను లోకల్ పర్చేజ్‌లో కొనుగోలు చేస్తున్నామన్నారు. వైద్యులు బయటకు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎంబీజేకే ద్వారా, లోకల్ ఏజెన్సీ నుంచి అత్యవసర మందుల కొనుగోలు చేసినట్లు చెప్పారు. క్షతగాత్రులు అత్యవసర విభాగానికి వస్తే ఎక్స్‌రే, స్కానింగ్ తీసుకెళ్లేందుకు స్ట్రెచ్చర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సూపరింటెండెంట్ కార్యాలయంలో కొందరు ఉద్యోగులకు స్థానచలనం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని పలు ఆలయాలు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్తాబు చేశారు. బుధవారం రాత్రి లింగోద్భవ కాలం తర్వాత శివపార్వతుల కల్యాణం నిర్వహించడానికి ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.


విద్యుద్దీపాలంకరణలో ప్రథమ నందీశ్వర ఆలయం

ప్రారంభమైన ఉత్సవాలు


గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గడివేముల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర ఆలయంలో మంగళవారం శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గడిగరేవుల గ్రామ వీధులలో ఊరే గించారు. స్వామివారు మంగళ వాయిద్యాల మధ్య గడిగరేవుల నుంచి దుర్గాభోగేశ్వర ఆలయానికి నందివాహనం మీద చేరుకున్నారు.

'కుటీర పరిశ్రమలతో జీవనోపాధి'

మహానంది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కుటీర పరిశ్రమలతో జీవనోపాధి లభిస్తుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్‌బాబు అన్నారు. బుక్కాపురంలోని మండల ఐక్య సంఘం భవనంలో పొదుపు మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జవహర్‌బాబు మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అభివృద్ధి పథంలో నడిచే అవకాశం ఉందన్నారు. పొదుపు సంఘాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని అన్నారు. ఉత్పత్తులు తయారీ చేయడమే కాకుండా మార్కెటింగ్ సౌకర్యం, ఇతర అంశాలపై పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రవీంద్రబాబు, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఐపీవో చంద్రశేఖర్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి'

మిడుతూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ డాక్టర్ ప్రతాప్ రెడ్డి, ఏడీఏ విజయశేఖర్ సూచించారు. మంగళవారం మిడుతూరు గ్రామంలో వ్యవసాయాధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో ఇండిగ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ పంటను పరిశీలించారు.

చికెన్ ప్రియులకు ఉచితంగా పకోడీ


చికెన్ సెంటర్ వద్ద బారులు తీరిన జనం

ఆత్మకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో చికెన్ ప్రియులకు వెన్‌కాబ్ సంస్థ వారు మంగళవారం బంపర్ ఆఫర్ ఇచ్చారు. 200 కేజీల చికెన్ పకోడీ, 2వేల బాయిల్ ఎగ్స్‌ను ఉచితంగా అందజేశారు. కోళ్లకు వైరస్ సోకుతుండడంతో ప్రజలు చికెన్ తినడానికి భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. దీంతో జనం బారులు తీరారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని 13, 20 వార్డుల్లో మంగళవారం నిర్వహించిన 'మన ఊరు మన బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. 13 వార్డు ఇన్‌చార్జి మధు సాయి, 20 వార్డు ఇన్‌చార్జి సుంకన్న మనియార్ ఖలీల్, 19 వార్డు పొన్నాపురం కాలనీ ఇన్‌చార్జి షేక్ మున్నా, 41 వార్డు టీడీపీ నాయకురాలు పద్మ మల్లికార్జున పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

నందికొట్కూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ మార్చి 3న కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా, మార్చి 6న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు.


'నమోదు చేసుకోవాలి'

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, తదితర అవసరాలకోసం రైతులు తప్పనిసరిగా రైతుసేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని ఏడీఏ విజయశేఖర్, ఏవో కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని 80బన్నూరు గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు పంటలపై అవగాహన కల్పించారు.

గుంతలోకి దూసుకెళ్లిన కారు

మహానంది, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహానంది -నంద్యాల రహదారిలో మంగళవారం సాయంత్రం భక్తుల కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన భక్తులు తమ సొంత వాహనంలో మహానంది శివరాత్రి ఉత్సవాలను తిలకించడానికి కారులో బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో ఈ ఘటన జరిగింది. భక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జాతీయ క్రీడాకారుడికి అభినందన


క్రీడాకారుడికి ప్రశంసా పత్రం అందిస్తున్న డీఎస్డీవో

నంద్యాల హస్పటల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణంలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి 70వ సీనియర్ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఏపీ పురుషుల జట్టు రజత పతకం కైవసం చేసుకుంది. పట్టణానికి చెందిన ఆవుల మల్లికార్జున జట్టులో సభ్యుడి ఉండి మంచి ప్రతిభ కనబరిచాడు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు, బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి అధ్యక్షుడు, ఇతర సీనియర్ క్రీడాకారులు ప్రశంసించారు.

మినీ గోకులాల పరిశీలన

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల, బండిఆత్మకూరులో నిర్మించిన మినీ గోకులాలను అంబుడ్స్‌మన్ సురేంద్ర కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాడి పశు పోషకులకు ఇకపై అగ్ని ప్రమాదాల, దోమల బెడద ఉండదని అన్నారు. అపరిశుభ్రత కూడా తగ్గిపోతుందన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఉచితంగా లడ్డూ పంపిణీ



లడ్డూలు తయారు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి , బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో యాగంటిలో నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సొంత నిధులు రూ.7లక్షలతో లడ్డూ ప్రసాదం పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. అలాగే సొంత నిధులు రూ.15లక్షలతో మంత్రి బీసీ ఎయిర్ కూలర్‌లకు మరమ్మతులు చేయించి భక్తులు ఎండవేడిమికి ఇబ్బందులు కలుగకుండా యాగంటి క్షేత్రంలో ఏర్పాట్లు చేశారు. బీసీ ఇందిరమ్మ స్వయంగా లడ్డూ తమ ఇంటి వద్దనే తయారు చేయించి భక్తులకు తొలిరోజు పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ మూడు రోజుల పాటు బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా భక్తులకు లడ్డూ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో చంద్రుడుతో పాటు టీడీపీ నాయకులు యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, బత్తుల భాస్కర్‌రెడ్డి, బండి హర్షవర్దన్‌రెడ్డి, మధన్‌భూపాల్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రేపు ఊటకొండలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ప్యాపిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని ఊటకొండ గ్రామంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ, రాతిదూలం పోటీలను నిర్వహించనున్నారు. 27న పురుషుల కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.41,116 నగదు బహుమతిని అందజేయనున్నారు. అలాగే వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.8వేలు, రూ.5వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవలసిందిగా వారు కోరారు. అలాగే వచ్చే నెల 3న రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలో గెలుపొందే వృషభాలకు మొదటి బహుమతిగా రూ.40వేలు అందజేయనున్నారు. అలాగే వరుసగా రూ.35వేలు, రూ.25 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాల కోసం 8073502169లను సంప్రదించాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్నికోట సమీపంలో వెలసిన గుండు మల్లేశ్వరస్వామి సన్నిధిలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్, కబడ్డీ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మాజీ జడ్పీటీసీ ఉదయ్‌బాస్కరరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి ఈపోటీలను ప్రారంభించారు. బాల్‌బ్యాడ్మింటన్ 30 జట్లు, కబడ్డీ 25 జట్లు హాజరైనట్లు న్యాయ నిర్ణేతలు తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, నీలం సంజీవకుమార్‌రెడ్డి, పీఈటీలు బాస్కరరెడ్డి, భుజంగరావు, శేఖర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రథమ, ద్వితీయ ఇంటర్ మీడియట్ విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. మంగళవారం విద్యార్థినులకు హాల్‌టికెట్లు, ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మొదటి సంవత్సరం 29 మంది, రెండో సంవత్సరం 24 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి: ఆర్డీవో

బేతంచెర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే రీసర్వేను రైతుల భాగస్వామ్యంతో పకడ్బందీగా చేపట్టాలని డోన్ ఆర్డీవో నరసింహులు రీసర్వే రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్డీవో బుగ్గానిపల్లె గ్రామంలో రీసర్వే గ్రామాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 32 బ్లాకులుగా విభజించి ఒక్కొక్క బ్లాక్ రోజుకు 20 ఎకరాలు రీసర్వే చేస్తారన్నారు. ప్రతి ఒక్క రైతు రీ సర్వేకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంట తహసీల్దార్ రమేష్‌బాబు, డీఐవోలు సురేస్, రీసర్వే డీటీ జై మహేశ్వరరెడ్డి, మండల డిప్యూటీ సర్వే నాగరాజు నాయక్, గ్రామ వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

సున్నం అడిగేవారే లేరు..!

బనగానపల్లె ఫిబ్రవరి 25: ఒకప్పుడు పలుకూరు సున్నం బట్టీలు వేలాది మందికి ఉపాధి కల్పించాయి. నేడు అవి మరుగునపడిపోయాయి. వివిధ రకాల పెయింటింగ్స్ రావడంతో పలుకూరు సున్నానికి డిమాండ్ పూర్తిగా పడిపోయింది. ఒకప్పుడు సుమారు వందకు పైగా ఉన్న సున్నం బట్టీలు ఉండేవి. ప్రస్తుతం కేవలం ఆరు మాత్రమే ఉన్నాయి.

- కనుమరుగవుతున్న సున్నం బట్టీలు
- నాడు వంద ...నేడు ఆరు ..
- పెరిగిన నిర్వహణ ఖర్చులు
- ఉపాధి కోల్పోయిన వేలాది మంది కార్మికులు



పలుకూరులో ఉన్న సున్నం బట్టీలు

కాలానుగుణంగా మార్పులు రావడంతో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలతో పాటు గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పలుకూరు బట్టీల ద్వారా తయారు చేసిన సున్నాన్ని వాహనాల ద్వారా సరఫరా చేసేవారు. ఇతర ప్రాంతాల్లో సున్నం తయారు చేస్తున్నప్పటికీ పలుకూరు సున్నం పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడంతో చాలామంది పలుకూరు సున్నాన్నే తమ ఇంటి గోడలకు వాడుకునేవారు. పలుకూరులో వందకు పైగా సున్నం బట్టీలు ఉండేవి. వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించేవి. ఇతర ప్రాంతాలకు సున్నాన్ని ఎగుమతి చేసేవారు. కాలానుగుణంగా మార్పులు రావడంతో సున్నం బట్టీలు ఒక్కొక్కటిగా మూతపడుతూ వచ్చాయి. ప్రస్తుతం పలుకూరు గ్రామంలో కేవలం ఆరు సున్నం బట్టీలు మాత్రమే ఉన్నాయి. మట్టి మిద్దెలు పోయి స్లాబ్ మిద్దెలు రావడంతో పలుకూరు సున్నానికి డిమాండ్ పూర్తిగా పడిపోయింది. స్లాబ్ మిద్దెల కు పెయింటింగ్ వాడుతుండడంతో సున్నాన్ని అడిగేవారే కరువయ్యారు.



సున్నమును సంచుల్లో నింపుతున్న కార్మికులు

భారీగా పెరిగిన ఖర్చులు

ముఖ్యంగా సున్నం తయారు చేయాలంటే లైన్ స్టోన్, బట్టీలు అంటించుకోవడానికి బొగ్గు లేదా కట్టెల ధరలు భారీగా పెరిగిపోయాయి. చిన్న ట్రాక్టర్ లైన్ స్టోన్ కావాలంటే రూ 3వేల ధర పలుకుతుంది. కట్టెలు కావాలంటే రూ 10 వేలు కావాల్సి వస్తుంది. కూలీల ఖర్చులు కూడా భారీగా పెరిగిపోయాయి. ఒకప్పుడు రూ. 100లకు కూలీలు పనులకు వచ్చేవారు. నేడు రూ. 500లు ఇస్తేనే పనికి వచ్చే పరిస్థితి ఏర్పడింది. సున్నం తయారైన తర్వాత ఒక చిన్న డబ్బా అమ్మితే రూ. 200 కూడా రావడం లేదని దీంతో సున్నం తయారీ గిట్టుబాటు కావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.

గిట్టుబాటు కావడం లేదు



సున్నం బట్టీలు గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడులు పెరిగిపోయాయి. ప్రభుత్వం ప్రోత్సాహం అసలు లేదు. రాయితీపై ప్రభుత్వం ముడిసరుకు అందిస్తేనే బట్టీల నిర్వహణ సాధ్యమవుతుంది.

- వెంకటేశ్వర్లు, సున్నం బట్టీ నిర్వాహకుడు, పలుకూరు

ఇద్దరే సున్నం బట్టీలు నిర్వహిస్తున్నారు

నిర్వహణ ఖర్చులు, ముడి సరుకుల ఖర్చులు భారీగా పెరిగాయి. చాలామంది సున్నం బట్టీలు నడపడానికి పెట్టుబడులు అధికంగా ఉండడంతో సున్నం బట్టీలను మూసివేసి ఇతర వృత్తులవైపు మొగ్గు చూపారు.



సున్నం కోసం రాళ్లను పగలగొడుతున్న వృద్ధురాలు

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

- వైసీపీని వీడి టీడీపీలో చేరిన వార్డు మెంబర్



టీడీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్ననాయకులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : టీడీపీతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీపీ, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోయలకుంట్ల గ్రామానికి చెందిన వార్డు మెంబర్ పరాన్ రషీద, షాకీర్ దంపతులు గ్రామ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో ఖాజా, మున్నా తదితర తన అనుచర వర్గంతో వైసీపీని వీడి మంగళవారం టీడీపీలో చేరారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి, అరుణమ్మ దంపతులను వారు శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహల్లో ఎస్‌ఎంఎస్ కంపెనీ సీఈవో, రిటైర్డ్ ఏఎస్పీ ఖలీల్ సౌదాగర్ ఆధ్వర్యంలో కూల్ మినరల్ వాటర్ ప్లాంటును మంగళవారం ప్రారంభించారు. బెలుం గుహలను సందర్శించేందుకు వేలాది మంది సందర్శకులు వస్తుండడంతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామని ఖలీల్ సౌదాగర్ పేర్కొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

అవుకు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు, పాడి యజమానులకు పశుసంవర్ధకశాఖ పథకాలపై అవగాహన కల్పించాలని పశువైద్యాధికారి భారతీదేవి అన్నారు. మంగళవారం అవుకు పట్టణంలోని పశువైద్య కార్యాలయంలో పశువైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ భారతీదేవి మాట్లాడుతూ మార్చి నెల 1వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

డోన్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి సునీల్, మేస్త్రీలు లక్ష్మిరెడ్డి, దానం, సుధాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పి-4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం చాగలమర్రి న్యూబిల్డింగ్స్ వీధిలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న రైతులందరూ విశిష్ట సంఖ్యను రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డోన్ ఏడీఏ అశోక్‌వర్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం కొలుములపల్లె గ్రామంలో ఏవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

పార్వేట మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు



రుద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరినగరం సమీపంలో తుండ్లవాగు వద్దన అహోబిళ లక్ష్మీ నరసింహస్వామి పార్వేట మహోత్సవం చివరి రోజు బుధవారం రాత్రికి పార్వేట ఉత్సవానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇస్కాన్ అహోబిళం దేవాలయం మేనేజరు చంద్రకేశవదాస్ మంగళవారం తెలిపారు. ఇస్కాన్ బృందం చేత కీర్తనలు, స్మృతిహారతి, గౌరహారతి, నరసింహకీర్తన, భోజన ప్రసాదం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డిలను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ డోన్ పట్టణ అధ్యక్షుడిగా శేఖర్



డోన్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ డోన్ పట్టణ అధ్యక్షుడిగా యాదర బోయిని శేఖర్, మండల అధ్యక్షుడిగా మహబూబ్ హుశేన్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధిష్ఠానం మంగళవారం నియామక పత్రాలను జారీ చేసింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసింహ యాదవ్, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెంపల్లె జనార్దన్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పుచ్చకాయలకు భలే డిమాండ్...



కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో వచ్చే పుచ్చకాయకు భలే డిమాండ్ ఉంటుంది. 95శాతం నీరు కలిగివున్న పుచ్చకాయను తినడంవలన డీహైడ్రేషన్ నుంచి విముక్తి లభిస్తుంది. దీంతో పుచ్చకాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కో పుచ్చకాయ రూ.100పైగానే అమ్ముడవుతున్నాయి. రూ.100మొదలుకొని రూ.150, 200వరకు విక్రయిస్తున్నారు. శీతల పానీయాలకంటే పుచ్చకాయలకు ప్రజల్లో విపరీతమైన డిమాండ్ ఉండటంతో, పల్లెలు, పట్టణాలు అన్నతేడా లేకుండా వ్యాపారులు పుచ్చకాయలను రాశులుగా పోసి విక్రయిస్తున్నారు.

యాగంటిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఆలయ ఈవో చంద్రుడు, పూజారులు

బనగానపల్లె , ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : యాగంటి ఉమామహేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఉమామహేశ్వరస్వామి వారి విగ్రహాలను ఈవోతో పాటు పూజారులు ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు వేదపండితుల సమక్షంలో చేశారు. ఉదయం 5 గంటలకు మహాన్యాసక రుద్రాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర నామావళి కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రుడు, టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి, ప్రధాన అర్చకులు మహేశ్ శర్మ, కిశోర్, చిన్నస్వామి, ఆనందశర్మ పాల్గొన్నారు.

కుక్కలు, పందులతో ఇబ్బందులు



రోడ్డుపైనే కుక్కలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆవులు, కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ప్రజల రాకపోకలు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. కుక్కలు అయితే ప్రజలపై దాడి చేస్తున్నాయి. పందులు మురుగు కాల్వల్లో పొర్లాడుతుండడంతో దుర్గంధంతో అల్లాడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను పందులను ఊరు బయట ఉంచాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆవులు రోడ్డుపై రాకుండా ఆవుల యజమానులకు తమ ఇళ్ల దగ్గరే ఉంచుకునేలా నోటీసులు జారీచేయాలని పలువురు మున్సిపాలిటీ అధికారులను కోరుతున్నారు.

కూలితే అంతే సంగతులు..!



చాగలమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్ద మకానం వీధిలో ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రమాదకరంగా మారింది. ట్యాంకు పిల్లర్లు, కడ్డీలు తేలాయి. 2.5 లక్షల నీటి సామర్థ్యంగల ఓవర్‌హెడ్ ట్యాంకును 28 ఏళ్ల క్రితం నిర్మించారు. దీని ద్వారా గ్రామంలోని పెద్దమకానం, చిన్నమకానం, గాంధీబజార్, ఎస్సీ కాలనీ, పలు వీధులకు నీటి సరఫరా కల్పించేవారు. ట్యాంకు లోపలి భాగం కూడా పెచ్చులూడుతుండటంతో ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్యాంకు చుట్టూ చిరు వ్యాపారులు బంకులు వేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్యను వివరణ కోరగా ట్యాంకు దెబ్బతిన్న విషయం వాస్తవమేనని, కొన్నేళ్ల నుంచి ట్యాంకుకు నీరు పట్టకుండా నిలిపి వేశాం. ట్యాంకు పరిసరాలను పరిశీలించి ట్యాంకును కూల్చివేసేందుకు గ్రామ పంచాయతీకి, ఉన్నతాధికారులకు నివేదికలు ప్రతిపాదించామని అన్నారు.

యూరియా స్టాక్ సీజ్

చాగలమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వెంకటేశ్వర ఎరువుల దుకాణంలో రికార్డులు సక్రమంగా లేని యూరియా బస్తాలను సీజ్ చేశామని ఏవో రంగనేతాజీ తెలిపారు. యూరియా అధిక ధరకు విక్రయించినందుకు 6-ఎ కేసు నమోదు చేయడం, ఎరువుల లైసెన్స్ రద్దు చేసి 15 రోజుల పాటు ఎలాంటి అమ్మకాలు చేయరాదని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఎరువులు విక్రయించినట్లు సమాచారం అందితే లైసెన్స్ రద్దు చేస్తామని ఏవో హెచ్చరించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

డోన్ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ అందరి బాధ్యత అని వాటర్‌షెడ్ ప్రాజెక్టు పీడీ విజేత అన్నారు. మంగళవారం మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో మైక్రో వాటర్‌షెడ్‌పై పాఠశాల విద్యార్థులతోకలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎద్దుపెంట గ్రామ మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మిద్దెపల్లి గోవిందు, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ సుధాకర్, సీనియర్ నాయకులు తాడూరు రమణయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

రుద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు ఈవో సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డితో సమావేశమయ్యారు. ఇటీవల ఇద్దరి మధ్య వాగ్వావాదం జరిగిన వషయం విదితమే. విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో స్పందించారు. ఇగోలకు పోకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన కూలీల సంఖ్య హాజరు లక్ష్యాలను ఛేదించకుంటే చర్యలు తప్పవని ఉపాధి ఏపీవో రవిప్రకాష్ తెలిపారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయారు. ఆయన మాట్లాడుతూ రోజుకు వెయ్యి మంది కూలీల హాజరు టార్గెట్ కాగా కేవలం 550 మంది మాత్రమే హాజరు అవుతున్నారన్నారు. వాటిని తప్పని సరిగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ షరీఫ్, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

చాగలమర్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, సజ్జ పంటలలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ దేవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

'బీసీలకు న్యాయం చేయండి'

డోన్ టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏపీలో జనగణనలో కులగణన చేసి బీసీలకు న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజుగౌడు కోరారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో నరసింహులును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 1932లో బీసీ జనాభా లెక్కలు బ్రిటీష్ పాలనలో తీసిన లెక్కలు అవే కొనసాగుతున్నాయని, కాబట్టి బీసీ కులాల జనాభా లెక్క ప్రకారం కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరారు.